# కథ చేసిన మేలు

ప్రతి ఏప్రిల్ నెల. ఊరందరిది ఒకదారి ఉలిపికట్టెదొక దారినట. అన్ని కాలేజీల్లోనూ మొదటి సంవత్సరం వాళ్లకు ముందయిపోతాయి పరీక్షలు. మా కాలేజీలో మాత్రం యూనివర్సిటీ పరీక్షలయ్యాక ఈ నెలలోనే అయ్యాయి.

నిన్న సాయంకాలం వరకూ ఎండెండు వెదకి చూచిన అందంగ అగుపించిన కాలేజి విద్యార్థులు అదేమి చిత్రమో ఈ వాళ సాయంత్రానికి ఒక్కడూ అయిపులేడు. ప్రొద్దుట పరీక్షలయ్యాయి. సాయంకాలానికి ఒకడైనా కలిపిస్తేనా! వీళ్ళంతా అంత యమర్జంటుగా వెళ్లి, ఏ పెద్ద గుఱ్ఱాలకు పళ్లుతోమాలో కాని.

కాలక్షేపం కావటం కష్టంగానేవుంది. మా లైబ్రరీకి కొత్తపుస్తకాలయితే వచ్చి మూడు నెలలైందికాని వాటని చదివే భాగ్యం మాకింతవరకూ పట్టలేదు. అందుచేత లైబ్రరీకి వెళ్లి ప్రయోజనంలేదు కనుక అలా పార్కుకి పోదామని బయలుదేరాను. దారిలో కిళ్లీకొట్టుమీద కొత్తవారపత్రిక కనవడింది. "ఈవాళ ఏం వారం అబ్బా!" అంటూ ఆలోచించి, చివరకు సోమవారం అని ధృవపరుచుకొని "ఏమిటో! పరీక్షలయిపోతే వారాలు కూడా జ్ఞాపకం వుండటంలేదు" అనుకొంటూ వారపత్రిక కొనుక్కొని పేజీలు తిరగవేస్తూ ఫుట్ పాత్ మీంచి నడిచి వెళుతున్నా.

"జాగ్రత్తరోయ్! ఎవరికైనా డాష్ ఇవ్వగలవు, క్రిందచూపే కాని పై చూపు లేదా!" అనటం నావీపుమీద ఒక్క చరుపు పడటం ఒక్కసారే జరిగాయి. ఎవరా అని వెనక్కు తిరిగాను. కృష్ణమూర్తి కనుపించాడు. కృష్ణమూర్తి, మేం నరసాపురంలో వుండేటప్పుడు మా ఇంటి ఎదుటింట్లో వుండేవాడు. మేం ఇద్దరం టైలర్ హైస్కూల్లో ఎస్. ఎస్. ఎల్. సి ఒకసారే పాసయ్యాం. నేనా తరువాత ఇక్కడికి వచ్చి కాలేజీలో చేరాను. కృష్ణమూర్తి ఉద్యోగంలో చేరాడు.

"ఇపుడెక్కడ వుంటున్నావ్‌రా!"

"అక్కడే!"

"ఏం ఇలా వచ్చావ్; ఎవరైనా బంధువులున్నారా!"

"చిన్న పనిమీద వచ్చాలే; పరీక్షలయిపోయాయా?"

"ఆఁ!"

"రా, కాఫీ తాగుదాం" అంటూ రవీంద్రలోకి లాక్కుపోయాను. కాఫీ తాగి బయటికి వచ్చేసరికి "వార్తలు చదువుతోన్నది. పన్యాల రంగనాథరావు" అంటూ రేడియో నుంచి వినపడుతోంది.

ఇద్దరం నెమ్మదిగా పార్కు చేరాం. ఆసనం చూసుకొని కూర్చునేసరికి "ఇక వివరాలు" అంటోంది రేడియో.

నా చేతిలో పత్రిక లాక్కుని బొమ్మలు చూస్తూ "ఎందుకురా ఈ అయింట్‌మెంట్? ఏ లైబ్రరీకన్నా వెళ్లి చదువుకొంటే. వదిలిపోయేదానికి" అన్నాడు కృష్ణమూర్తి.

**శ్రీ యర్రామురళీ కృష్ణమోహన్**

"సరిలే; లైబ్రరీకి వెళ్లి చదివినట్టే. ఎంత ముందుగా వెళ్లినా ఎవడో ఒకడు దీన్ని గుత్తకుపుచ్చుకుని కూర్చుంటాడు. ఇక ఆ మహానుభావుడు దాన్ని వదలడు. అందులోనూ, తన చేతిలో పుస్తకంకోసం ఇంకో వ్యక్తి కాచుకొని కూర్చున్నాడని తెలియగానే, లైబ్రరీ మూసే వేళకు కాని ఆ వ్యక్తి ఆ పత్రికని వదలడు ఇలాంటి వ్యక్తులు కాక, ప్రతి లైబ్రరీకీ కొందరు అభిమాన పుత్రులు వుంటారు. మొట్టమొదట లైబ్రరీకి వచ్చిన ప్రతిపత్రిక వాళ్ళు చదివందే మరొకరు చదవలేరు. ఇన్ని గండాలూ దాటి పుస్తకం మన చేతికి వచ్చేసరికి మళ్ళీ సోమవారం రానే వస్తుంది. ఎందుకొచ్చిన బాధ ఇదంతా, కొనుక్కొంటే తీరిపోతుంది" అన్నాను.

"అది నిజమే!......ఈ కథలు కేవలం కాలక్షేపానికే నంటావా?" అన్నాడు వాడు.

"కాకపోతే, శాస్త్ర విజ్ఞానం కూడా ప్రసాదిస్తాయి."

"అదీ కాక, ఈ కథలు మనమీద కొంత ప్రభావం చూపెడుతుంటాయి" అన్నాడు కృష్ణమూర్తి.

"అదెలా?"

"అదెలాగో చెప్పనా?" అంటూ కృష్ణమూర్తి చెప్పటం ప్రారంభించాడు.

ఇది నిజంగా జరిగిన సంగతి, ఇదేం కథనుకోకు. వాళ్లు చాలా భాగ్యవంతులు. ఆ ఇంటి యజమాని రామయ్యనాయుడు గారికి రెండు వందల యకరాల పొలం వుందని ఆ వీధిలో అంతా అనుకుంటారు. వాళ్లు మాత్రం రెండువందల యాభై యకరాలని చెప్పుకుంటారు. వాళ్ళు భాగ్యవంతులు కనుక వాళ్ళకి ఓ కారు వుందని, వాళ్ళ ఇల్లు ఒక మహాసౌధం అని, వాళ్ల ఇంటి కిటికీలకు, గుమ్మాలకు తెరలుంటాయని, ఇంటిముందు చిన్న వనం వుంటుందని ఎవరయినా అనుకొంటే పూర్తిగా పొరపడ్డట్టే!

రామయ్యనాయుడిగారికే కాక ఆ ఇంట్లో అందరికీ డబ్బుకి ప్రాణానికి లంకె. ప్రపంచంలో అవసరాలకు డబ్బు కర్చుపెట్టని పిసనారివాళ్లు చాలామందివుంటారు. కాని, రామయ్యగారి కుటుంబం అవసరాలకు డబ్బు ఖర్చు చేయరు సరికదా, ఇతరులు ఖర్చుపెట్టటం చూసికూడా సహించలేరు.

పిసనారివాళ్లకూ కొన్ని తప్పనిసరి ఖర్చులుంటాయి. రామయ్యనాయుడుగారు వారపత్రికలు, మాసపత్రికలు కొని విధిగా చదువుతుంటారు. చాలామందిలో ఒక అభిప్రాయం వుంది; యువకులే కాని వయసు మళ్ళినవారు కథలు, నవలలు చదవరని. అది కేవలం అపోహ అని రామయ్యనాయుడుగారు ఋజువు చేశారు

ఇక రామయ్యనాయుడుగారి కుటుంబ పరిస్థితి; నాయుడుగారికి ముగ్గురు ఆడసంతానం, ఒక మగసంతానం. కొడుకు ఇంటర్‌మీడియట్ క్లాసులో పార్ట్ త్రీతో కుస్తీ పడుతున్నాడు. కూతుళ్ళిద్దరూ పెళ్లికి సిద్ధంగా వున్నారు. రామయ్యనాయుడుగారు, పెద్దమ్మాయి పెళ్ళి చేయాలని అయిదేళ్ళనుంచి ప్రయత్నమట కాని ఇంతవరకూ ఆయన సఫలుడు కాలేకపోయాడు.

కిట్టనివాళ్లెన్నో అనుకుంటారు రామయ్యనాయుడుగారి గురించి.

"అప్పుడే ఏం తొందరమ్మా. ఇప్పుడే పెళ్లిచేస్తే పదివేలూ ఈనాడే అల్లుడికియ్యవలసి వస్తుంది. రెండుమూడేళ్ళాగితే ఆ

పదివేలుపై రెండుమూడు వేలన్నా. వడ్డీ రాకమానదు, అది పెట్టి పెళ్లిచెయ్యొచ్చు, అసలు అలాంటి దేమయినా చెయ్యదల్చుకొంటేను!" అని అమ్మలక్కలు చెప్పుకోవటం ఒకసారి నేనుకూడా వినటం జరిగింది.

ప్రపంచంలో ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక బాధపడేది డబ్బు లేనివాళ్లు. కట్నాలు ఇవ్వలేక, తామిచ్చే కట్నాలకు సరైన వరుడు దొరకక బాధపడటంవుంది. కానీ డబ్బు పేరబెట్టున్న రామయ్యా నాయుడుగారి వంటి ధనికుడు కూతురు పెళ్లిచేయటానికి ఎందుకు వాయిదాలు వేస్తున్నాడా అని ఆ వీధివారంతా ఆశ్చర్యపోవటంలో తప్పేముంది ?

ఒకరిద్దరు "అమ్మాయిగారి పెళ్లెప్పుడండి" అని అడిగి రామయ్యానాయుడుగారిచేత ముఖం వాచే చివాట్లు తిన్నట్టు కథలు వున్నాయ్. అందుచేతనే ఆ ప్రసక్తి ఆయన ముఖంముందు తేవటానికి ఎవరికీ దమ్ములుండేవికావు.

ఇలా వుంటోండగా, ఒకనాడు రామయ్యా నాయుడుగారి ఇంటిముందు కూలీలు పందిర వేయటం ప్రారంభించేసరికి అక్కతంబేమో తెలియక ఆ వీధివారంతా నోళ్లుతెరచి అలా చూస్తూవుండిపోయారు. చివరకు తర్జనభర్జనలమీద ఆ వీధివారు గ్రహించిందేమంటే రామయ్యా నాయుడుగారి అమ్మాయి వివాహం అని.

రామయ్యానాయుడుగారి అమ్మాయి వివాహం జయప్రదంగానే ముగిసింది. కట్నం కొంత బకాయివేద్దామని నాయుడుగారు ప్రయత్నించారుకాని, అల్లుడు పీటలమీంచి లేచిపోతే ఇంట్లోకి వెళ్లి తక్కిందికూడా తెచ్చిఇచ్చాడాయన.

రెండురోజుల తరువాత, ఆవేళ సాయంకాలం నేనూ నా రూమ్‌మేట్ రామం తూర్పు లాకుల దగ్గరకు వెళ్ళాం షికారు పిచ్చాపాటీ మాట్లాడుకొంటూ. తిరుగు ముఖం పట్టేసరికి మసగమసగ చీకటి పడింది. రైల్వేస్టేషన్ సమీపానికి వచ్చేసరికి మాకు ముందు ఇద్దరు వ్యక్తులు వెళుతున్నట్టు గమనించాం. అందులో ఒకాయన "టక్...టక్" మంటూ శబ్దం చేసుకొంటూ చేతికర్ర సహాయంతో నడుస్తున్నాడు. ఇంతలో ఒకాయన సన్నగా దగ్గి "మా అమ్మాయి పెళ్ళి ఇంత అకస్మాత్తుగా చేయటం చూసి మా వీధివాళ్లెంత ఆశ్చర్యపోయా రనుకున్నావ్" అన్నాడు. ఆ కంఠస్వరం మాకు చిరపరిచితమయినదిగా వినిపించింది.

"అలాగా !" అన్నాడు రెండో వ్యక్తి.

"కారణం ఏమిటో తెలుసా ?" అన్నాడు మొదటివ్యక్తి మళ్ళీ.

"ఏమిటి !"

"నేను కథలు, నవలలు చదువుతోంటాను నీకు తెలుసుగా; నాకు చిన్నప్పటి నుంచి అదో అలవాటయిపోయింది. మొన్న వారం పత్రికలో "ఎవరిది తప్పు ?" అన్న కథ చదివాను. నామనస్సంతా కెలికినట్టయిపోయింది. కీడెంచి మేలెంచాను. మా అమ్మాయిపెళ్ళి అనుకోకుండా చేయటానికా కథే కారణం."

"అలానా !" ఆ పత్రిక నీదగ్గర వుందా" అన్నాడు రెండో వ్యక్తి.

"ఆఁ! వుంది, నువ్వుకూడా చదువుదువుగాని లే."

మేం ఇద్దరం ఊపిరి బిగపట్టి వింటున్నాం. పెద్ద హత్యారహస్యం పొంచి వింటున్నట్టు.

ఆ ఇద్దరు వ్యక్తులు సినిమాహాలు దాటి వంతెనమీంచి రోడ్డు పట్టారు. ఆ వంతెన కిళ్లీ దుకాణాలనుంచి ప్రసరిత మవుతున్న ట్యూబులైట్ల కాంతిలో ఆ ఇద్దరు వ్యక్తులు మాకు స్పష్టంగా అగుపించారు. ఆ ఇద్దరూ; ఒకరు రామయ్య నాయుడుగారు, రెండు పెళ్ళికి వచ్చి రామయ్యానాయుడిగారి బలవంతంమీద వున్న ఆయన చిన్ననాటి స్నేహితుడు గోవిందరావుగారు.

దారిలో కనబడితే, ఆ వారం పత్రిక కొనుక్కొని వెళ్ళాం. రామయ్యానాయుడుగారు చెప్పిన కథ చదివాను.

ఒక డబ్బుగల వ్యక్తి తన దర్జాకు తగ్గ వరుడు దొరక్క కూతురుపెళ్లి చేయటానికి కాలవిలంబన చేస్తోంటాడు. ఆ అమ్మాయి సహజమయిన తన కోరికలను ఎప్పటిదాకానో అణచుకోలేక - తీర్చుకొంది. ఫలితంగా పాపాయి పుట్టే సూచనలు కన్పించాయి. ఆమె తన ప్రియుడితో వెళ్లిపోయింది, పాలసముద్రంవంటి ఆ ఇంటివారి వంశానికి మాయని మచ్చను వదలి. కూతురుకోసం బెంగపెట్టుకొని తండ్రి మంచం పట్టి మరణించాడు" ఇదీ సంక్షిప్తంగా ఆ కథ.

రెండు మాసాల తరువాత ఒకనాడు పోస్టుమేన్ రామయ్యా నాయుడిగారి అమ్మాయి పేర ఒక మనియార్డర్ తెచ్చాడు. ఆ అమ్మాయి అప్పుడు అత్తవారింట్లోవుంది. రామయ్యానాయుడుగారు కూడా సమయానికి ఇంట్లో లేకపోవటం జరిగింది. నేను ఎవరు పంపారా మనియార్డరని చూశాను. "మా పత్రికలో ప్రచురించబడిన "ఎవరిది తప్పు?" అను మీ కథానికకు ఈ మొత్తం పారితోషికంగా పంపబడినది. అందినట్లు వ్రాయండి" అని వుంది ఆ మనియార్డరు కూపనుమీద అని ఆగాడు కృష్ణమూర్తి. నేను ఆశ్చర్యపోయాను కాసేపు.

"మరి ఆ అమ్మాయి పేరు పత్రికలో పడలేదూ?" అన్నాను.

"లేదు. కాంతం అని పడింది. ఆమె పూర్తిపేరు సూర్యకాంతం. ఈ కాంతం తన కూతురు సూర్యకాంతం అని రామయ్యనాయుడుగారెలా అనుకొంటాడు."

"రామయ్యానాయుడిగారి గురించి ఇంత విపులంగా చెప్పావ్, ఆయనతో నీకుగల సంబంధం ఏమిటి?" అనడిగాను.

"ఆయన ఇంటి వీధి గదిలో నేనూ, మా ఆఫీసులో ఇంకో గుమాస్తా రామం అద్దెకుంటేవాళ్లం" అంటూ కృష్ణమూర్తి పక్క దులుపుకొంటూ లేచాడు. "ఇంతటితో నేటి గ్రామస్థుల కార్యక్రమం సమాప్తి" అంటోంది రేడియో. కథ చేసిన మేలు తలుచుకొంటూ పార్కునుంచి బయటపడ్డాం ఆవేళ. ★

మిలిటరీ లారీ వొకటి పిచ్చెత్తినట్లు ప్రతి పల్లెకూ తిరిగి తిరిగి చీకటిపడే వేళకు మళ్ళీ కాంపుకు కాబోలు పోతున్నది. ఇంతలో రోడ్డు మీద ఎవడో రెండు గాడిదలను నడిపించుకు పోతూ వుండడం ఆడ్రైవరు కంట బడింది. వాడి దగ్గరకు పోయాక లారీ స్పీడు తగ్గించి "ఏం సోదరా? వాళ్లిద్దరూ నీ అన్నదమ్ముల్లా వున్నారే? అదేం పాపం-వాళ్లిద్దరి మెడలకీ తాళ్లుకట్టి నడిపించుకు పోతున్నావేం?" అన్నాడు ఆడ్రైవరు.

"ఆ మరేంలేదు - ఈగాడిదలు కూడా మిలిటరీలో చేరిపోతాయేమో నని!!" అని సమాధానం యిచ్చాడు, రోడ్డుమీద నడిచిపోతున్న మనిషి.